

ఈవెంట్స్‌లో పాల్గొన్న అభ్యర్థులు

## ప్రశాంతంగా కొనసాగుతున్న ఈవెంట్స్..

**రెండోరోజు దేహదారుఢ్య పరీక్షకు 844 మంది అభ్యర్థులు హాజరు**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** పోలీస్ శాఖలోని కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల భర్తీ క్రమంలో గురువారం మహబూబ్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో ఉదయం 5 గం.ల నుండి దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. మహిళా అభ్యర్థులకు జరిగిన పరీక్షలలో 1036 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా, 844 మంది హాజరయ్యారు. వీరిలో 425 మంది అభ్యర్థులు ఈవెంట్స్ పూర్తచేసి తరువాతి పరీక్షకు అర్హత సాధించారు. దేహదారుఢ్య పరీక్షకు సాఫీగా సాధించేందుకుగాను ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్లు యోగేష్ గౌతమ్, ఐపెస్, జిల్లా ఎస్పీ నరసింహ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కొరకు డిపిఓ సిబ్బంది, ఇతర అధికారులు ఆయా ఈవెంట్ల దగ్గర తగిన జాగ్రత్తలు తీసుకుని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



ఈవెంట్స్‌లో పాల్గొన్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## సదా సీదాగా మండల సర్వసభ్య సమావేశం..

**పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

**వెల్దండ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:**ప్రతి 3 నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం ఈ దఫా సదా సీదాగా కొనసాగింది. గురువారం వెల్దండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులపై సర్వసభ్య సమావేశంలో అధికారులు తమ నివేధికలను ఎక్కడ వినిపించలేదు. తిమ్మినోనిపల్లి సర్పంచ్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆసరా పింఛన్లు తీసుకోవడానికి రాచూర్ గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామంలోనే ఆసరా ఫించన్లు ఇచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. మరికొందరు ఎంపీటీసీలు మాట్లాడుతూ మండలంలో చేపడుతున్న చెరువులు, చెక్ డ్యాంలను ఆక్రమిస్తున్నారని, తుంకిబండతాండ దగ్గర ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున వెలిసిన వెంచర్లలో అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లు జరిగిన ఊపేక్షించేది లేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.మండలానికి 7 పల్లె దవాఖానాలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజితారెడ్డి, ఎంపీడీఓ మోహన్‌లాల్, డీటీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సర్పంచ్‌లు వెంకటమ్మ, చెర్కు రేవతి, కొమిటి, బుజ్జి, దార్ల కుమార్, రామకృష్ణ, ఇస్లావత్ కుమార్, పత్యానాయక్, గోరటి శ్రీనివాస్, బీరయ్య, ఎంపీటీసీలు మోతిలాల్, వెంకట్‌రెడ్డి, గుత్తి వెంకటయ్య, నీరటి రాములు, చక్రవర్తితో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## గడప గడపకు కాంగ్రెస్ ప్రజల గుండెల్లో కాంగ్రెస్..

**అలంపూర్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ 11వ రోజు మండలంలో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాలమేరకు ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ సంపత్‌కుమార్ కార్యకర్తల సమక్షంలో హాత్ సే హాత్ జోడో యాత్రను అలంపూర్ మండలం ఉట్కూర్, భీమవరం గ్రామాల ప్రజలతో మమేకమై చేయి చేయ కలుపుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ వాదాన్ని వినిపిస్తూ యాత్రను సాగిస్తున్నారు. 9 ఏళ్ల దొరల పాలనలో ఏ ఒక్కరికి ఇల్లు రాలేదని, కరెంటు బిల్లులు మోత మోగుతుందని, సిలిండర్ ధర ఆకాశాన్నంటిందని, నిత్యావసర సరుకులు అందడం లేదని, పంటకు గిట్టుబాట ధర రాలేదని ప్రజలు తమ గోడును సంపత్‌కుమార్‌తో వెలిబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ, కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీ యాత్రకు దేశంలో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందన్నారు. అవినీతి, కుటుంబ పాలన అంతమొందించే సమయం ఆసన్నమైందని, కాంగ్రెస్ రాజ్యం రాబోతుదని, రైతు కష్టాలు తీరబోతున్నాయన్నారు. నిరంకుశ పాలనతో నివ్వెరపోయిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనకోసం ఎదురుచూస్తున్నారు. అలంపూర్ పాలన అవినీతి కమిషన్లతో రాజ్యమేలుతుందని, అక్రమ ఇసుక, మద్యం దందాలతో అధికార పార్టీ నాయకులు అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాత్రతో అలంపూర్‌లోని అన్ని మండలాలలో ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజలు పడుతున్న సమస్యలను, ఇబ్బందులను తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేస్తూ ప్రజల ఆదరాభిమానాలతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి ప్రజల ఆశయాలను సుసాధ్యం చేస్తామని హామీ ఇస్తూ యాత్రను విజయవంతం చేస్తామన్నారు. ఈ యాత్రతో టిఆర్ఎస్ అవినీతి పాలన అంతమై సోనియమ్మ రాజ్యం అధికారంలోకి వస్తుందని ప్రజలకు భరోసా నింపుతూ యాత్రలో అడుగు ముందుకు వేస్తున్నామన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు టిఆర్ఎస్ పాలనతో విసుగుచెంది యాత్రకు బ్రహ్మరథం పడుతున్నారంటే ఇందిరమ్మ రాజ్యం, రైతు రాజ్యం కావాలని కోరుకుంటున్నారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్ వెంట అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గడప గడపకు కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

## కంటి వెలుగును పకడ్బందీగా.. అమలు చేయాలి..!

**- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం - వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి**



వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి



సమీక్షా సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్, అధికార బృందం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:**కంటి వెలుగు కార్యక్రమంలో గుర్తించిన ప్రెస్క్రిప్షన్ కంటి అద్దాలు ఎవరి అద్దాలు వారికే అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి సూచించారు. గురువారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంటి వెలుగు, డబుల్ బెడ్‌రూం, పోడు పట్టాలు, ప్రొఫార్మా-1 కంటి వెలుగు పోడు 58,59,76,115 జీఓల క్రింద క్రమబద్ధీకరణలు, తెలంగాణకు హరితహారంపై జిల్లా కలెక్టర్లతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని, అన్ని జిల్లాలో బాగా చేపడుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రెస్క్రిప్షన్ కంటి అద్దాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విధంగా తయారు చేసి ఆయా జిల్లాలకు పంపించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వచ్చిన కంటి అద్దాలు ఎవరి అద్దాలు వారికే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్వాలిటి కంట్రోల్ బృందాలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ మౌళిక సదుపాయాల విషయంలో రాజీపడకుండా చూసుకోవాలన్నారు.

మున్సిపాలిటి పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారులను గుర్తించి వారి వివరాలు కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ ఈ నెల 26 లోపు పూర్తి కావాలని సూచించారు. పోడు పట్టాల జారీ విషయంలో మాట్లాడుతూ అర్హులైన వారి పట్టా పాసు పుస్తకాల కొరకు అన్ని పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి పాస్ పుస్తకాల ముద్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే హరితహారంలో ఏ గ్రామ పంచాయతీకి సంబంధించి ఆ గ్రామ పంచాయతీ నర్సరీల నుంచి మొక్కలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలు బాగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు పొడవైనవి ఉండే విధంగా చూడాలని, కడియం నుంచి మొక్కులు కొనే పరిస్థితి ఉండకూడదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటి వరకు 15,10,033 మందికి పరీక్షించామని, 19957 మందికి దగ్గర చూపు అద్దాలను అందజేశామన్నారు. ప్రెస్క్రిప్షన్ అద్దాలు జిల్లాకు 14050 రావడం జరిగిందని, ఇప్పటి వరకు 326 మందికి ఎవరి దూరపు చూపు అద్దాలు వారికి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రొఫార్మ -1 ప్రకారం మున్సిపాలిటి, గ్రామ పంచాయతీల్లోని నాన్ అగ్రికల్చర్ ప్రాపర్టీ వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు మనుచౌదరి, మోతిలాల్, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్‌లాల్, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, అసిస్టెంట్ డిటీడబ్ల్యూఓ కమలాకర్‌రెడ్డి, ఆర్డీఓలు నాగలక్ష్మి, రాజేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

**నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

గద్వాల టౌన్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త : గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, పోడు భూములు, 58,59,76,118 ప్రభుత్వ జిఓల ప్రకారం చేయాల్సిన క్రమబద్ధీకరణ, తెలంగాణకు హరితహారం, రెండు పడక గదుల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్లతో విడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ విడియో సమావేశం గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ కలిసి జిల్లా కలెక్టరేట్ అధికారులతో సమావేశాలు నిర్వహించడం జరిగింది. విడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు కింద ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు ఎప్పటికప్పుడు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాకు వచ్చిన ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు ఎఎన్ఎంల వారిగా విభజించి లబ్దిదారులకు పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిఓ 58,59,76,118 సంబంధిత దరఖాస్తులపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ విడియో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శశికళ, డా. సిద్దప్ప, అసిస్టెంట్ డి.ఆర్‌డిఓ నాగేంద్రం, సూపరింటెండెంట్ రాజు,శాఖ అధికారి దేవరాజు, పవన్ కొనసాగుతున్నారు.

## ప్రజలను నట్టేట ముంచుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు..

**ఆకాశాన్నంటే విధంగా నిత్యావసర ధరలు**

**కాంగ్రెస్‌తోనే సుస్థిర సంక్షేమ ఫలాలు**

**మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి**

**తెల్కపల్లి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన తీరు ప్రజలను నట్టేట ముంచుతున్నారని మాజీ మంత్రి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగం జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గౌతంపల్లి గ్రామంలో హాత్ సే హాత్ జోడో యాత్ర సందర్భంగా గ్రామానికి చేరుకున్న నాగం జనార్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు గ్రామంలోని ప్రజలు, డోలు చప్పుడులుతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేపట్టి వారు గౌతంపల్లి గ్రామ ప్రజలతో మమేకమై మాట్లాడుతూ 2001వ సంవత్సరంలో గౌతమ్‌పల్లి గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను, గ్రామానికి రోడ్డు సౌకర్యాన్ని మొదలైన సంక్షేమ ఫలాలను అందించడం జరిగింది. గౌతంపల్లి గ్రామ ప్రజలను, గ్రామాన్ని హక్కున చేర్చుకుని గ్రామ అభివృద్ధిని తన అభివృద్ధిగా మలచిన రోజులను గుర్తు చేశారు. గ్రామంలోని ప్రజలకు సీలింగ్ భూములను 70 ఎకరాలకు పైగా పంచడం జరిగింది. గ్రామంలోని ప్రజలకు ఇళ్ల స్థలాలతో పాటు గృహ నిర్మాణాలను కూడా 100కు పైగానే నిర్మించడం జరిగింది. అందుచేత మీరు నా పైన ఇంత అభిమానం కురిపిస్తున్నారని వారితో ఆప్యాయంగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పేద ప్రజలను నట్టేట ముంచుతున్నారు. రేపు జరగబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి ఇందిరమ్మ రాజ్యాన్ని మళ్లీ మనం తెచ్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని వారితో మాట్లాడారు. వంటగ్యాస్, పప్పు, చింతపండు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానికి తాకే విధంగా పెంచుకుంటూ పోతే, డీజిల్, పెట్రోల్ రేట్లను సామాన్యులు వినయోగించుకోలేనంత విధంగా పెంచడం జరిగిందన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న నాగం జనార్ధన్‌రెడ్డి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరును మనం తిప్పికొట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో తెచ్చుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే వంటగ్యాస్ కేవలం రూ.500లకే, తక్షణమే రుణమాఫీ, 57 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి పెన్షన్,నిరుద్యోగభృతి,సంక్షేమ పథకాలను అమలు చేపడుతుందని ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. దళితు లపై వివక్షత, దళితులకు మూడెకరాలు దళితున్న ముఖ్యమంత్రి పదవి ఎక్కడ అని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఒక్కసారి వారికి గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, టిపిసిసి సభ్యులు, డిసిసి సభ్యులు, జడ్పీటిసి సుమిత్ర, మండల పార్టీ అధ్యక్షులు వెంకటయ్యగౌడ్, సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ బాలగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కలుషిత ఆహారం తిని 10 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు..

**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:**మండలంలోని తాండ్ర పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన విద్యార్థుల్లో 10 మంది తీవ్ర తలనొప్పితో వాంతులు, విరేచనాలకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు అయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆశా వర్కర్లతో మందు గోళిలు వేయించి తాత్కాలిక ఉపశమనం కల్పించడంతో 5 మంది విద్యార్థులు కోలుకున్నారు. మరో 5 మంది విద్యార్థులకు వాంతులు తగ్గక పోవడంతో అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనం ఉడికి ఉడకకపోవడంతో పాటు వాసన, గింజలు గింజలుగా ఉన్న భోజనాన్ని తినడం వల్లే విద్యార్థులకు సమస్య వచ్చిందని బహుజన్ సమాజ్ వాది పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు ఆంజనేయులు పేర్కొన్నారు. రాజేష్, గణేష్, సురేందర్, యశ్వంత్, సూర్యతేజ అనే విద్యార్థులు కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులకు గ్లూకోజ్ అమర్చిన వైద్యులు అబ్జర్వేషన్ చేపట్టి ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్నానాయక్ ఆసుపత్రికి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో మహిళలకు బదులుగా పురుషులు మధ్యాహ్న భోజనం వండుతున్న అధికారులు, ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

## దేవరకద్ర మండలంలో కాంగ్రెస్ జోడోయాత్ర ప్రారంభం..

**- మొదటిరోజు చిన్నరాజమూర్‌లో ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ నాయకులు**

**- నేడు కోయిల్‌సాగర్‌లో జోడోయాత్ర**

**దేవరకద్ర,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** ఏఐసిసి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రాచారం కార్యక్రమాన్ని ఆ పార్టీ దేవరకద్రలో గురు వారం చిన్నరాజమూర్‌లో ఎంతో ఉత్సహాంగా ప్రారంభిం చింది. దేవరకద్ర మండలంలో మొదటిరోజు ఈ కార్యక్ర మాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్వరాందాసు అద్వర్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఈ యాత్రను ప్రారంభించారు. మండలంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఈ యాత్రలో భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భం గా చిన్నరాజమూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రదీ ప్‌గౌడ్ ప్రసంగించారు.

**ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ నాయకులు: ప్రదీప్‌గౌడ్ ఆరోపణ**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని చిన్నరాజమూర్ ప్రదీప్‌గౌడ్ జోడో యాత్రలో ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ళు కట్టిన గ్రామాలలో మేము ఎన్నికలలో పోటీచేస్తామన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు కూడ డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు ఇచ్చిన గ్రామాలలో పోటీ చేయాలని ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పనితీరుపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. అలాగే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్గీ అధికారంలోకి వస్తే చేసే పనులను ఆయన ప్రకటించారు. పార్టీ హామీలను ప్రజలకు తెలియజేశారు. ప్రధానంగా ధరణి,గ్యాస్ సిలిండర్,పెట్రోల్,డిజిల్ పోడుభూముల క్రమబద్ధీకరణ,రుణమాఫీ విషయాలను తమ ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగితెలుసుకొన్నారు. పార్టీ కీలక హామీలను కూడ ఆయన ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ప్రజలనుండి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ యాత్రలో ప్రజలు తమ సమస్యలను కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకవస్తున్నారన్నారు.ప్రతి గ్రామంలో చాలా సమస్యలున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆ సమస్యలన్ని తెలుసుకొంటున్నామన్నారు. పేద,సామాన్య ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే చేసే పనులను యాత్రలో ప్రజలకు ప్రకటించారు.

ఏఐసిసి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ప్రజలు హారతులతో ఘనస్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో నీరాజనాలు పలుకి యాత్రకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. గడప గడపకు తిరిగి ప్రజలను యాత్రలో కలుసుకోవడానికి మంచి అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబిసి ప్రధానకార్యదర్శి వేణుగోపాల్,రాధాకృష్ణారెడ్డి,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్వరాందాసు,టీపీసీసీ ఓబిసి ఉపాధ్యక్షుడు రాజమూరి శ్రీనివాసులు,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి రాఘవంద్రగౌడ్,టీపీసీసీ ఫిషర్మెన్ కార్యదర్శి మహేశ్,నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీ అహ్మద్,నాయకులు ఉషనప్ప,గోవర్దన్,భగవంతుగౌడ్,కిషన్‌రావు,జాఫర్,నాగిరెడ్డి,వెంకటేశ్,కథలప్ప,సత్తిగౌడ్,వెంకటేశ్,చిన్నప్ప,రాజేశ్వర్‌రెడ్డి,నరసింహ్మ,రాజేందర్,రవి,దాసు,కేశవులులతో పాటు అడ్డాకుల మండల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నరాజమూర్‌లో ప్రసంగిస్తున్న ప్రదీప్‌గౌడ్



వృద్ధురాలిని సమస్యలు అడిగి తెలుసుకొంటున్న దృశ్యం



చిన్నరాజమూర్‌లో కాంగ్రెస్ జోడోయాత్ర

**నేడు కోయిల్‌సాగర్‌లో జోడోయాత్ర..**

దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్‌లో శుక్రవారం కాంగ్రెస్ జోడోయాత్ర ప్రారంభిస్తున్నట్లు ప్రదీప్‌గౌడ్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూధన్‌రెడ్డి,టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు కొండ ప్రశాంత్‌రెడ్డి,అరవింద్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

## రైతు భీమా చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే సతీమణి



**కెటిదొడ్డి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతుభీమా చెక్కులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి అందజేశారు. కెటిదొడ్డి మండలం మల్లాపురం గ్రామం బోయ పార్వతమ్మ భర్త నర్సింలు అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రైతుభీమా రూ.5 వేల చెక్కును అందజేశారు. ఆపద సమయంలో మమ్మల్ని ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిలకు లబ్దిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గద్వాల పిఎసిఎస్ ఛైర్మన్ ఎంఎ సుభాన్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండు తెగులు తీవ్రంగా నష్టపోతున్న రైతులు..



**తెల్కపల్లి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో యాసంగి సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టాన్ని మిగిల్చిందని రైతులు వాపోయారు. గ్రామంలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 300ల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశామని వారు తెలిపారు. ఈ మొక్కజొన్న పంటలో మొదట మొక్క దశలో అంతా మంచిగానే పెరిగింది. కానీ కండెపట్టే దశలో వేర్ల ద్వారా ఎండు తెగులు వ్యాపించి మొక్క పూర్తిగా ఎండిపోవడం జరిగింది. రైతులందరు పూర్తిగా పెట్టుబడి పెట్టి చివరికి పంట చేతకొచ్చే దశలో ఈ విధంగా ఎండిపోవడం వల్ల రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. వ్యవసాయ అధికారులను సంప్రదించిన భూమిలో వేర్ల ద్వారా వైరస్ వ్యాపిస్తుందని తద్వారా పంట మొత్తం ఎండిపోవడం జరుగుతుందని తెలపడం జరిగిందన్నారు. గ్రామ రైతులందరూ పెట్టుబడి కూడా చేతికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలి..

### బిజెపి మండల మాజీ అధ్యక్షుడు వెంకట్‌రామ్‌రెడ్డి



**కోయిల్‌కొండ,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల సంక్షేమంకోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతిగడపకు చేరేవిధంగా బిజెపిపార్టీ కార్యకర్తలు విస్తృత ప్రచారం కల్పించాలని మండల బిజెపి మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సూచించారు.మండలంలో నిర్వహిస్తున్న శక్తికేంద్రాల సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేయడం ఖాయమన్నారు. నారాయణపేట నియోజకవర్గ కేంద్రంలో ఈసారి కమలం జెండా ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోయిలకొండ మండలంలో బిజెపి పార్టీని పటిష్టం చేసేందుకు శక్తి కేంద్రాల సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో బిజెపి పార్టీని పటిష్టం చేసేందుకు అన్ని గ్రామాలలో పర్యటించడం జరుగుతుందన్నారు. బూతు కమిటి అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యాప్తంగా త్వరలోనే పార్టీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నాగర్‌కర్నూల్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి 20వ తేదీ వరకు ప్రతి రోజు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, 17న 7 బస్సులు, 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రతి రోజు 20 బస్సుల చొప్పున ప్రత్యేక బస్సులు నడపనున్నామని డిపో మేనేజర్ పేర్కొన్నారు. ప్రయాణీకులందరు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించవచ్చునన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడవద్దని తెలిపారు.

## అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి కంటి వెలుగు



**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** అంధత్వ రహిత సమాజ నిర్మాణం చేపట్టాలనే రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డు విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం స్థానిక వార్డు కౌన్సిలర్ కుడుముల చైతన్య కిశోం రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు సద్విని యోగం చేసుకోవాలన్నారు. యూటిఎఫ్ భవన్‌లో 4 రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, నాయకులు కిశోర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## శివనామస్మరణతో మారుమోగిన వెల్దండ



**వెల్దండ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బుధవారపేట ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం శివ స్వాములు పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించి ఇరుముడి కార్యక్రమాన్ని స్వాములు కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు ఇరుముడులు కట్టుకొని శివనామస్మరణతో గ్రామం నుంచి జాతీయ రహదారికి చేరుకున్న శివస్వాములకు భక్తులు మంగళహారుతులు పట్టారు. తదనంతరం ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక వాహనంలో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. కార్యక్రమంలో శివస్వాములు తదితరులు ఉన్నారు.

## నేడు యండమూరి వీరేంద్రనాథ్ జడ్చర్లకు రాక

**జడ్చర్ల,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నేడు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పట్టణంలోని పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు కవి, రచయిత, ఉపన్యాసకులు, డా. యండమూరి వీరేంద్రనాథ్‌చే పదవ తరగతి పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నిత్యాన్నదానానికి విరాళాలు



**కొత్తకోట,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** పట్టణ కేంద్రంలోని శ్రీ అంబ భవాని దేవాలయంలో శివస్వాములకు నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. శివస్వాముల అన్నదానానికి తమవంతు సాయంగా చింతలపల్లి బాబురెడ్డి రూ. 5116 దంతనూరు పాపయ్య చార రూ. 5116, కానాయపల్లి ఆంజనేయులు రూ. 5116లు ఆలయ కమిటి సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని శివస్వాములు వారిని దీవించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సదాశివుడు, నందుస్వామి, గురుస్వామి నాగన్న, కె. శ్రీనివాస్, జి. శాంతిరెడ్డి గోపాల్ యాదవ్, శేఖర్‌రెడ్డి, రాఘవరెడ్డి, బాలచారి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అంబరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- మరో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన గుండాల
- మహాశివరాత్రికి పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- ఫిబ్రవరి 24న పెద్ద రథోత్సవం. మార్చి 04 వ తేదీ వరకు ఉత్సవాలు



అంబరామలింగేశ్వరస్వామి దేవాలయం



అంబరామలింగేశ్వరస్వామి మూల విరాట్



గుండం



పెద్ద రథోత్సవం

**వెల్దండ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ అంబరామలింగేశ్వరస్వామి దేవాలయం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారికి వెల్దండ మండల కేంద్రం నుంచి 4 కిలో మీటర్ల దూరంలో కలదు. మరో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచి గుండాల అంబరామలింగేశ్వరస్వామి విరాజిల్లుతుంది. 11వ శతాబ్దానికి చెందిన పురాతన దేవాలయంగా ప్రసిద్ధికెక్కినది. కాశీ పుణ్యక్షేత్రం నుంచి గుండాల సప్తగుండంలోకి భూగర్భజల ద్వారం ఉందని, అక్కడ బెత్తం వేస్తే ఇక్కడ తేలుతుందని పురాణాలు చెబుతున్నాయి. కాశీ పుణ్యక్షేత్రంలో స్నానం ఆచరించిన, గుండాల అంబరామలింగేశ్వరస్వామి వద్ద స్నానం ఆచరించిన ఒకే పుణ్యఫలం లభిస్తుంది. ఈ యేటా అంబరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఆలయ ప్రదక్షిణం, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యము, ఋుత్విగ్వరణ, దీక్షాధారణ, రక్షాబంధనము, అఖండ దీప స్థానము, మండపారాధన, తీర్థ ప్రసాద వినియోగము, సాయంత్రం 5 గంటలకు మృత్సంగ్రహణ, అంకురార్పణ, ధ్వజారోహణము, త్రిశూలపూజ, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర వాహనము, బలిహరణ, నిరాజన, మంత్రపుష్పముల కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 18 తేదీ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 4 గంటలకు మహన్యాస, పూర్వాక, ఏకాదశ రుద్రాభిషేకం, అంబ పరమేశ్వరి దేవికి అలంకరణ, అభిషేకం, లలితాష్టోత్తర కుంకుమార్చన, ఉదయం 7గంటలకు స్వామి వారికి భక్తులచే అభిషేకం, అర్చనలు, రుద్రవాహనం, సాయంత్రం 4గంటలకు స్వామి వారి ఉత్సవ మూర్తుల వెల్దండ గ్రామ ప్రదక్షిణ, రాత్రి 10 గంటలకు అంబరామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవం, ఫిబ్రవరి 19న తేదీన రుద్రవాహనం, మూలమంత్ర వాహనములు, వాస్తు మండపారాధన, వాస్తుహవనం, సాయంత్రం 6గంటలకు మండపదేవాత ఆహ్వానము, యాగశాల, బలిహరణ, చతుర్వద సస్తి, 20న రుద్రపారాయణం, సూర్యనమస్కరములు, వాస్తు బలిహరణ, శాంతికుంభస్థాపన, ఆలయ దేవతహవనము, బలిహరణ, 21న స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శతకల శస్థాపన, ఉత్సవ మూర్తులకు వంసతోత్సవం, పుష్పోత్సవము, 22న పుష్ప రథోత్సవం(చిన్న తేరు), 24 ఉదయం 8గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అంబ పరమేశ్వరి దేవీ క్షీరాభిషేకం, విశేష మంగళ ద్రవ్యములతో అభిషేకం, విశేష అలంకరణ, భక్తులచే అమ్మవారికి లలితసహస్రనామాలచే కుంకుమార్చనలు, మంత్రపుష్ప, తీర్థప్రసాదన, 25న తెల్లవారుజామున 2 గంటలకు పెద్ద రథోత్సవం, 08న రాత్రి గంటలకు వృషభవాహన సేవ, 26న మధ్యాహ్నం 12గంటలకు హంసవాహన తెప్పోత్సవం, 9గంటలకు నాఖబలి, మార్చి 03వ తేదీన న అంబరామలింగేశ్వర దేవికి అభిషేకం, అలంకరణ, సహస్రనామ కుంకుమార్చన, మూల మంత్ర హవానము, నవగ్రహ వాహనము, లక్ష్మికుభేరహవానము, తీర్థప్రసాద వితరణ, మార్చి 04వ తేదీన ఉదయం 9గంటలకు అదిత్యాది నవగ్రహ దేవతా, మూలమూర్తుల, మూలమంత్ర సహిత రుద్రహవానము, మధ్యాహ్నం 12గంటలకు అష్టదిగ్బాలి, బలిహరణ, మహపూర్ణహుతి, అమ్మవారికి అభిషేకం, భక్తులచే సమర్పించిన వడిబియ్యం సమర్పణ, మహా నివేధన, మహా మంగళహారతి, స్వస్తివచనం, స్వామి వారి గ్రామోత్సవంలు శైవాదమోక్త ప్రకారంగా జరపబడును. కావున భక్తులు ఇట్టి భగవత్ సేవ కార్యక్రములనందు సకుటుంబ సపరివారంగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రలు కావాలని దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు.

## పెరికివీడు తండాలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ధ్వజస్తంభ ప్రతిష్టాపన చేస్తున్న దృశ్యం



పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

**కోయిల్‌కొండ,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెరికవీడు గ్రామ పంచాయతీలో గల పెరికివీడు తండాలో గురువారం ఆంజనేయస్వామి దేవాలయం ముందు వేద పండితులైన బ్రాహ్మణోత్తముల మంత్రోచ్చరణాల మధ్య పూజా కార్యక్రమాలు గావించి ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఉమ్మడి పెరికివీడు గ్రామ పంచాయతీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి పూజా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం గ్రామస్తుల మధ్య కన్నుల పండుగలా సాగింది. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తూ అభిషేకము నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. భక్తమండలి సభ్యులతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీధర్ కిశోర్, దేవాలయ కమిటి సభ్యులు ఉత్తరప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ హిమబిందు రవిందర్‌నాయక్, రాజేందర్, వి. చందర్, భీమ్లానాయక్, వి. గోప్రానాయక్, మంగిలాల్, కె.చందర్, కె.జ్యోతిరామ్, కె.హూన్యానాయక్, తండా పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాధురి సేవా ఫండ్ వారి ఉపకార వేతనాలు అందజేత..



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసిన దృశ్యం

**జడ్చర్ల,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణంలోని బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న 36 మంది విద్యార్థులకు గురువారం మాధురి సేవ ఫండ్ నుండి ట్రై సర్వీసెస్ ఎక్స్ సర్వీస్మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు, సాయినాకపూరి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 1,45,580 (దాదాపు లక్ష యాభైవేల రూపాయలు) ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా విద్యార్థుల బ్యాంక్ ఖాతాలలో జమచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ మాట్లాడుతూ పేద ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించే ఇటువంటి గొప్ప సంస్థలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ రైల్వే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. భాష్యం సూచన మేరకు కళాశాల ఆంగ్ల శాఖ అధ్యక్షులు డా. తిరుపతయ్య విద్యార్థులచే స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేయించి, కళాశాలలో చదువుతున్న విద్యార్థుల స్థితిగతులను మాధురి సేవా ఫండ్ వారికి వివరించి ఉపకార వేతనాలను మంజూరు చేయించినందుకు, పేద విద్యార్థుల మీద ఉన్నవారి ప్రేమను ప్రిన్సిపల్ కొనియాడారు. ఇంకా ఎంతో మంది ప్రతిభ కలిగిన వి ద్యార్థులు ఉన్నారని, భవిష్యత్తులో వారిక కూడా ఉపకార వేతనాలు అందేలా కృషి చేయాలని డా. తిరుపతయ్యను కోరారు. మాధు రిసేవా ఫండ్ ఛైర్మన్ నాగేష్, చంద్రగుప్త ట్రాయ్ సర్వీసెస్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రెజరర్ పార్వతీశం, ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్ రసీదులను అందించి వారి మనోభావాలను తెలుసుకునే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాన్ కో ఆర్డినేటర్ పి. శ్రీనివాసులు, హరిత సదాశివయ్య, ఆంగ్ల విభాగాధ్యక్షులు రమాదేవి, తెలుగుశాఖ అధ్యక్షులు ఎన్. సుభాషిణి, చరిత్రశాఖ అధ్యక్షులు బీరయ్య, టిఎస్‌కెసి నిర్వాహకులు వీరప్రతాప్, ఉపన్యాసకులు అనిత, జగన్, వెంకట్‌రెడ్డి, విక్రమ్,విద్యార్థులు పాల్గొన్నారు.

### విజయవంతంగా నడుస్తున్న

## కంటివెలుగు శిబిరం

### రోజుకు 148 మందికి పరీక్షలు




కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**మల్దకల్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం జనవరి 19న ప్రారంభించగా ఇప్పటి వరకు శిబిరాలు విజయవంతంగా నడుస్తున్నాయి. మల్దకల్ మండలంలో రెండు టీంలు పని చేస్తుండగా మల్దకల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో ఇప్పటి వరకు 2680 మంది కంటి పరీక్షలు నిర్వహించుకుని కంటి అద్దాలు పొందారు. ప్రతిరోజు 150 మంది టార్గెట్ కాగా 148 మంది వరకు వచ్చి పరీక్షలు నిర్వహించుకుంటున్నట్లు డా. జయమ్మ తెలిపారు. అవసరమైన వారికి రీడింగ్ గ్లాస్ పరీక్షలు నిర్వహించిన అనంతరం కొంత మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాస్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కంటి వెలుగు శిబిరంలో డా. జయమ్మ, పిహెచ్ఎన్ రామేశ్వరమ్మ, సరస్వతి, నవీన, డీఈఓ తరుణ్‌కుమార్, ఆప్తాల్మిక్ సురేష్, ఆశాలు సుజాత, పరిమళ, సులోచన,నరసమ్మ, అనిత పాల్గొన్నారు.

### ఏకాగ్రతతో చదివి ఉన్నత

## శిఖరాలను అధిరోహించాలి

**లింగాల,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్‌సిఓ వనజ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి కె. తరుణ్‌కు రూ. 5 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆర్‌సిఓ వనజ మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పేదరికం అడ్డు కాదని ఇష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినోద్‌కన్నా, వైస్ ప్రిన్సిపల్ బాలస్వామి, పిడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థి
కె. తరుణ్‌కు రూ. 5 వేలు అందిస్తున్న ఆర్‌సిఓ వనజ

## వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



**కెటిదొడ్డి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం కెటిదొడ్డి గ్రామంలోని వివాహ వేడుకలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్, కౌన్సిలర్‌లు నాగిరెడ్డి, నరహరి, శ్రీనివాసులు, నాసిరుద్దిన్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** తాడూర్ మండల పరిధిలోని గోవిందాయపల్లి గ్రామానికి చెందిన బాలచంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ పరంగా ఆదుకుంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ఏఈగా బాధ్యతలు స్వీకరించిన వి.సూర్యం



**వెల్దండ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** వెల్దండ మండల విద్యుత్ అధికారి వి.సూర్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొల్లాపూర్ సబ్ డివిజన్‌లో సబ్ ఇంజనీయర్‌గా విధులు నిర్వర్తించి పదోన్నతిపై వెల్దండ మండలానికి విచ్చేసి విద్యుత్ ఏఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈ సూర్యం మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్‌ను ఆదా చేయాలని,ఆటోమెటిక్ స్టార్టర్ బదులు రైతులు అవసరం ఉన్నప్పు డే రైతులు మోటార్లను ఆన్ చేయాలని, దీంతో నీటితో పాటు విద్యుత్ కూడా ఆదా అవుతుందన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్ ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి



**మూసపేట,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మూసపేట మండల పరిధిలోని వేముల స్టేజీ 44వ రహదారి దగ్గర ప్రైవేట్ ట్రావెల్ బస్ ఢీకొని కుమ్మరి రాములు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మూసపేట ఎస్సై నరేష్ కథనం ప్రకారం గురువారం తెల్లవారుజామున 5.30 గం.ల ప్రాంతంలో సంకల్‌మద్ది గ్రామానికి చెందిన కుమ్మరి రాములు 55 అనే వ్యక్తి తన సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుండి హైదరాబాద్‌కు వెళుతున్న ఆర్ఎస్ ట్రావెల్స్‌కు చెందిన ఎన్ఎల్ 01 బి 2406 నంబర్ గల ప్రైవేట్ ట్రావెల్ బస్ ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతుడు కుమ్మరి రాములుకు కుమారుడు నాగరాజు, కుమార్తెలు జ్యోతి, సత్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై నరేష్ తెలిపారు.

# మహిమ కలిగిన అంతర గంగ

▸▸ ఇప్పటి వరకు ఎండిపోని గుండం

▸▸ దీర్ఘకాలిక రోగాలకు ఉపశమనం కలుగుతుందని నమ్మకం

**గండీడ్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సల్కర్‌పేట్ సమీపంలో ఉన్న అంతరగంగ లింగేశ్వర స్వామి ఆలయం చారిత్రక ప్రాశస్త్యం కలిగింది. ఈ ఆలయానికి మండలంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తుంటారు. సల్కర్‌పేట సమీపంలో ఉన్న ఈ ఆలయం వద్ద పూర్వం ఋషులు తపస్సు చేశారని ప్రతీతి. అంతర గంగ సమీపంలోనే స్వయంభూ శివలింగం ఉంది. ఋషులు అక్కడ తపస్సు చేసి అంతర గంగలో స్నానమాచరించి శివుడిని కొలిచేవారని పూర్వీకులు చెప్పారని స్థానికులు చెబుతుంటారు. 1975లో కరువు వచ్చినప్పుడు ఇక్కడికి వచ్చిన ఆచల గురువు అంజిలయ్యా స్వామి సమీపంలో చంద్రయుని గుట్ట ఉన్న శివలింగానిక పూజలు చేయకపోవడం కరువుకు కారణమని స్థానికులకు చెప్పారు.దీంతో స్థానికులు గుట్టపై ఉన్న శివలింగాన్ని అంతరగంగ వద్దకు తెచ్చి ప్రతిష్టించి ఆలయం నిర్మించారు.



అంతర గంగ లింగేశ్వరస్వామి ఆలయం

**లోతు తక్కువ.. నీరు తీయగా...**

అంతరగంగగా ప్రసిద్ధి చెందిన ఈ గుండం లోతు చాలా తక్కువ. అయినా పూర్వ కాలంనుంచి ఇప్పటివరకు ఎంత కరువు వచ్చిన సమయంలోనూ గుండంలో మాత్రం నీటిమట్టం తగ్గలేదని పెద్దలు చెబుతారు. గుట్టల నుంచి నీరు అంతర ప్రవాహంగా వస్తుందని భక్తులు, సమీప ప్రాంతాల వారి నమ్మకం. ఈనీరు కొబ్బరి నీటి రుచిని కలిగి ఉంటుంది. పూర్వం ఋషులు తపస్సు చేసిన ప్రాంతం కావడంతోనే ఆ నీటికి ఆ రుచి ఉందని, మహిమాన్వతమైనదని భక్తులు నమ్ముతారు.దీర్ఘరోగాలు ఉన్నవారు ఇక్కడి గుండంలో స్నానంచేసి శివయ్యను కొలిస్తే తగ్గుతుందని నమ్ముతారు. మానసిక దివ్యాంగులను ఎక్కువగా ఇక్కడికి తీసుకువస్తుంటారు. ఆదివారం అమావాస్య వచ్చిన రోజు అంతరగంగ ప్రాంతం భక్తులతో నిండిపోతుంది. తెల్లవారు జామున 3 గం.లకే అందులో స్నానమాచరించి పూజలు చేశారు. ప్రతి సంవత్సరం శివరాత్రి ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. ధ్వజా రోహణం, రుద్రాభిషేకం, బిల్వార్చన, శకటోత్సవం, సాయంత్రంస్వామి కళ్యాణోత్సవం జరుగుతుంది. అంతర్వాహిణి ద్వారా గంగాజలం పూర్వ కాలంలో ప్రతిష్టించిన స్వయంభువు లింగము ముందు ఈ గుండం ఉంటుంది. ఈ గుండంలోనికి అంతర్వాహిణి ద్వారా గంగాజలం లాంటి నీరు వచ్చుటనే దీనికి అంతర్గంగ లింగేశ్వర దేవస్థానంగా పేరు వచ్చింది. ఆదివారం అమావాస్య వచ్చిందంటే అంతరగంగ జనాలతోనిండిపోతుంది. ఉదయం 3గం.ల నుంచే స్నానాదులు పూర్తిచేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇతర జిల్లాల నుంచి ప్రత్యేక స్నానాలు ఆచరించి పునీతులు అవుతున్నారు.



అంతరలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రాశస్త్యం కలిగిన అంతరగంగ

## పల్లీలు, ఉల్వలతో సిఎం కెసిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



పల్లీలు, ఉల్వలతో కెసిఆర్ చిత్రపటాన్ని తయారు చేసిన దృశ్యం

**వనపర్తి ,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను వినూత్నంగా నిర్వహించేందుకు వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు సిద్ధమైంది. మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు బాంధవుడికి జన్మదిన శుభాకాంక్షల పేరుతో 25 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పు కెసిఆర్ చిత్రపటాన్ని వేరుశనగ, ఉల్వలు, ఉప్పు, రంగులతో రూపొందించారు. నేడు వనపర్తి మార్కెట్ యార్డులో రైతులతో పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు.

## మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



**గద్వాల టౌన్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా, వైద్య ఆరోగ్య అధికారి డా. శశికళ, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డా. సిద్దప్ప చేతుల మీదుగా గురువారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తెలంగాణ మెడికల్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున జిల్లా వైద్యారోగ్య శాఖ డైరీ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య సిబ్బంది రామకృష్ణ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## అమరచింత మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా శ్యాంకుమార్ ఎన్నిక

**అమరచింత,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** అమరచింత మండల యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం గురువారం అమరచింత మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో పిసిసి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నారాయణపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీహరి, మక్తల్ నియోజకవర్గం నాయకులు పోలీస్‌చంద్రశేఖర్‌రెడ్డి,విష్ణువర్ధన్‌రెడ్డి, మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు సమక్షంలో అమరచింత పట్టణానికి చెందిన శ్యాంకుమార్‌ను అమరచింత మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా ప్రకటించారు.శ్యాంకుమార్ ఎంపిక పట్ల కాంగ్రెస్‌మండల,పట్టణఅధ్యక్షులు జుబేర్‌అహ్మద్,ఎస్‌ఎం అరుణ్‌కుమార్, విష్ణు, ప్రకాశం,తౌఫిక్,తిరుపతి,మన్నన్,కెజిమహిందర్‌రెడ్డి హర్షం ప్రకటించారు.

## జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తులు

**పెబ్బేరు,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** 44వ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పెబ్బేరు మండల పరిధిలోని 44వ జాతీయ రహదారి రంగాపూర్ భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో క్రెటా కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న బీచుపల్లి జయమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై జగదీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రానికి చెందిన బీచుపల్లి తన అత్త మల్దకల్ మండలం నీలపల్లికి చెందిన జయమ్మ ఇద్దరు కలిసి వనపర్తి జిల్లాకేంద్రం సమీపంలోని దర్గాను దర్శించుకుని తిరిగి వారి గ్రామాలకు వెళ్లే సమయంలో హైదరాబాద్ నుండి కడప వైపు వెళ్తున్న క్రెటా కారు వెనుకవైపు నుండి ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారని ఎస్సై తెలిపారు. ఇద్దరు మృతదేహాలను వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలు కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. క్రెటా కారు డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీశ్రీశ్రీ గణేకల్ శ్రీజ్ఞాన ప్రకాశ మహంత శివయోగి గురువు ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే

**కెటిదొడ్డి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కెటిదొడ్డి మండల పరిధిలోని గువ్వలదిన్నె గ్రామంలో శ్రీశ్రీశ్రీ గణేకల్ శ్రీ జ్ఞాన ప్రకాశ మహంత శివయోగి గురువును కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆశీస్సులు పొందారు. శ్రీశ్రీ గణేకల్ శ్రీ జ్ఞాన ప్రకాశ మహంత శివయోగి గురువును ఎమ్మెల్యే పూలమాల, శాలువా కప్పి సత్కరించి ఆశీస్సులు పొందారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్, వైస్ ఎంపిపిరామకృష్ణనాయుడు, కౌన్సిలర్ నాగిరెడ్డి, సర్పంచ్ మహాదేవి, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు హనుమంతు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులుచక్రధర్‌రావు,గోపాల్‌రెడ్డి,యుగందర్‌గౌడ్,వెంకటేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ కోచింగ్‌ను వినియోగించుకోవాలి



విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ ఇస్తున్న శ్రావణ్‌కుమార్

**లింగాల,ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** విద్యార్థులు ఫ్రీ కోచింగ్‌ను వినియోగిం చుకోవాలని గద్ద శ్రావణ్ కుమార్ కోరారు. మండల పరిధిలోని అవుసలికుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రతిరోజు సాయంత్రం 4 గం.ల నుండి 6 గం.ల వరకు విద్యార్థులకు ఫ్రీగా కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. నిరుపేద విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధిస్తూ 2014 నుంచి ఇప్పటివరకు 75 మంది విద్యార్థులను గురుకులపాఠశాలలో చేర్పించడంజరిగిందన్నారు. విద్యార్థులకు ఫ్రీగా కోచింగ్ ఇస్తూ ఎంట్రన్స్ రాయిస్తున్నారని తెలిపారు. వివిధ ఆట పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పించి వివిధ గురుకుల పాఠశా లకు ఎంపిక కావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా చదువు మధ్యలో మానేసిన విద్యార్థులకు కోచింగ్ ఇస్తూఓపెన్ టెన్త్,ఇంటర్,డిగ్రిలో చేరుస్తున్నట్లు తెలిపారు.ఫ్రీకోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇంఛార్జ్ ఈఈని కలిసిన సర్పంచ్‌లు



**ఇటిక్యాల,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా పంచాయతీ రాజ్ ఇంఛార్జి ఈఈగా ఆంజనేయులు పదవి బాధ్యతలు చేపట్టడంలో గురువారం జిల్లా కార్యాలయంలో మండలంలోని పెద్దదిన్నె గ్రామ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ఎర్రవల్లి సర్పంచ్ రవిఆయనను కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న శివకుమార్‌ను జోగులాంబ గద్వాల జిల్లా ఇంఛార్జి ఈఈగా పని చేశారు. వారి స్థానంలోఆంజనేయులును ఇంఛార్జిఈఈగా నియమించారు. ఈ నేపథ్యంలోనే వారిని కలిసి పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులకు బిల్లులు సకాలంలో అందేలా చూడాలని కోరారు.

## ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఆట సామాగ్రి పంపిణీ



**కల్వకుర్తి, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం రఘుపతిపేట, వం గూరు మండలం జాజాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ సహకారంతో అందజేసిన దుస్తులను శుక్రవారం ఉప్పల వెంకటేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి విద్యార్థినీ, విద్యార్థులకు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానంలో చూడటమే ఉప్పల ట్రస్ట్ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో తలకొండపల్లి మండల ఎంపీపీ తిర్మణి నిర్మల శ్రీశైలంగౌడ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గోపాల్ నాయక్, శృతిలయ అకాడమీ చైర్మన్‌చిత్తరంజన్‌దాస్, నాయకులు శశికుమార్ గౌడ్, పూరి రమేష్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా యూత్ పార్లమెంట్ అవగాహన సమావేశం

**కల్వకుర్తి, ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా యూత్ పార్లమెంట్ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ యొక్క ప్రతిభాపాటాలను కనబర్చారు. మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు పాటలు, వకృత్వం, ఉపన్యాస పోటీల్లో ప్రతిభను చాటి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కోటానాయక్, జిల్లా బాలికల విద్య అభివృద్ధిఅధికారి సూర్యచైతన్య, కళాశాలప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తాన్, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖాజాబీ, రిసోర్స్ పర్సన్ రాజ్‌కుమార్, ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ హరిఫుద్దిన్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## అడహక్ పద్ధతిలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

**ఖిల్లాఘనపురం,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సోలిపూర్, మానాజిపేట ఆదర్శ పాఠశాల మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల బాలికల ఉన్నత పాఠశాల కెజిబివి తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం అప్పారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మామిడిమాడ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియు తెలంగాణ బలపరిచిన ప్రస్తుత ఎమ్మెల్సీ డా. కాటేపల్లి జనార్ధన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆయా పాఠశాలలోని ఉపాధ్యాయులను పిఆర్‌టియు తెలంగాణ యూనియన్ నాయకులు కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అడహక్ పద్ధతిలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి హైకోర్టు మార్చి 14 వరకు స్టే విధించినందున కనీసం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని పిఆర్‌టియు తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 13న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కాటేపల్లి జనార్ధన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అన్నారు. మోడల్ స్కూళ్లలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది ఉపాధ్యాయులు మరణించినప్పటికి వారికి కారుణ్య నియామకాలు జరగలేదని తెలిపారు. మరణించిన ఉద్యోగస్తుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు జరపాలని మోడల్ స్కూల్ వ్యవస్థలో నాన్ టీచింగ్ రెగ్యులర్ పోస్టులను మంజూరు చేయాలని అన్నారు. కెజిబివి ఎస్‌ఓసిఆర్‌టి అకౌంటెంట్ ఎఎన్‌ఎంలకు టైం షెడ్యూల్ ప్రకటించి వార్షిక ఇంక్రిమెంట్స్‌లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియు తెలంగాణ యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయ హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తున్న యూనియన్‌కు అండగా నిలవాలని అన్నారు.కార్యక్రమంలో గజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌కుమార్,ఉపాధ్యాయులు శ్రీనివాసులు, షఫి, కిరణ్, నవీన్ కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

● పాఠశాల పనులలో వేగం పెంచాలి : నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి గోవిందరాజులు



పాఠశాలల పనులను పరిశీలిస్తున్న డీఈఓ

**తెల్కపల్లి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి గోవింద రాజులు సూచించారు. గురువారం మండల పరిధిలోని ఆలేరు, పెద్దూరు, గట్టు రావిపాకుల ఉన్నత, పాఠశాలలు వారు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు మనబడి పనులను పరిశీలించి అనంతరం పాఠశాలల ఉపాధ్యాయులతో పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పనులను వేగం పెంచాలన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తొలిమెట్టు పర్యవేక్షణపై జిల్లాలో రాష్ట్ర బృందం పర్యటన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మెరుగైన విద్యను అందించాలనే సంకల్పంతో తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించుట, పరికరాలతో విద్యార్థులకు బోధనను సులభతరం చేయాలని తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని చంద్రకల్, ముప్పిపల్లి,పెద్దకొత్తపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు అమలు తీరును, 10వ తర గతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడం, ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు స్నాక్స్ అందించడం, 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం లాంటి అంశాలను పరిశీలించి తగిన సలహాలు,సూచనలు అందించిన రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు చంద్రశేఖర్, జగదీష్‌రెడ్డిలతో పాటుగా జిల్లా డీసీఇబీ సెక్రటరి, అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు, జిల్లా సెక్టోర్ అధికారి భరుపతి వెంకటయ్యలు ఉన్నారు.

# ఇరుముడితో శ్రీశైలంకు బయలుదేరిన శివస్వాములు



ఇరుముడితో శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

**కెటిదొడ్డి,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శివాలయంలో శివస్వాములు గతకొద్ది రోజులుగా ఎంతో భక్తి శ్రద్ధలతో శివనామస్మరణ గావించి ప్రతినిత్యం శివున్ని కొలుస్తూ శివపూజలు నిర్వహించారు. శివ స్వాములు మహా పడిపూజ కార్యక్రమాలు, అన్నదానాలు, భజన సంకీర్తనలతో ఎంతో నియమ నిష్ఠలతో శ్రీశైల భ్రమరాంబికా శివపార్వతులను కొలుస్తూ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి సమీపిస్తుండడంతో శివమాల ధరించిన స్వాములు గురువారం మండల కేంద్రంలోని శివాలయం దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వ హించారు. శివస్వాములను సాగనం పడానికి కుటుంబ సభ్యులందరు తరలివచ్చారు. స్వాములకు ఒడిబియ్యం నింపుతూ కుటుంబ సభ్యులు సాగనంపారు. గురుస్వాములు ఆర్. ఉరు కుందు, భీమన్న, శివ స్వాములు అందరిని వెంటబెట్టుకుని శ్రీశైలంకు బయలుదేరారు. కార్యక్ర మాన్ని తిలకించేందుకు కుటుంబ సభ్యులతో పాటు గ్రామ స్తులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.కార్యక్రమంలో కెటిదొడ్డి గ్రామ శివస్వాములు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే పేదలకు బుక్కెడు బువ్వ దొరికేది

● రాష్ట్ర పిసిసి మాజీ అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్





కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

**అమరచింత,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** కాంగ్రెస్ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు బుక్కెడు బువ్వ దొరికేదని పిసిసి రాష్ట్ర అధికార ప్రతి నిధి కేశం నాగరాజుగౌడ్, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీహరి అన్నారు.గురువారం అమరచింత మండల కేంద్రంలో అమరచింత, ఆత్మకూర్, నర్వ మండలాల యువజన కాంగ్రెస్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సమస్యలు పరిష్కరించడంలో వైఫ ల్యం చెందాయని రాబోయే ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్ ప్రభుత్వాలను ప్రజలు ఇంటికి సాగనంపాలని వారు ప్రజలను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, రైతులకు 2 లక్షల రుణమాఫీ, మహిళలకు గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని, విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్, ఖాళీ స్థలంఉన్న వారికి రూ.5 లక్షలు,కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని వార న్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలను కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చెప్పాలని వారు కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జుబేర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎస్‌ఎం అరుణ్‌కుమార్,పోలీస్‌చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తులసి రాజు, కెసి మహిందర్, మాజీ ఎంపిటిసి మహంకాళి విష్ణు,శ్యాం, ప్రకాశం, తౌఫిక్, పి. విష్ణు పాల్గొన్నారు.

# కళ్యాణం.. కమనీయం..

-కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పట్టణ ప్రముఖులు



కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, పలువురు నాయకులు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని శ్రీలక్ష్మి పద్మావతి శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. రథసప్తమి దినోత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏటా శ్రీ లక్ష్మిపద్మావతి శ్రీ వెంకటేశ్వర స్వామి కన్నుల పండువగా నిర్వహిస్తుంటారు. కళ్యాణ వేదికను పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వెల్దండ మండల జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై కళ్యాణోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఆలయ మూల విరాట్‌ను నూతన వస్త్రాలతో అలంకరించి కళ్యాణ ఘట్టను కొనసాగించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కల్వమనోహర్ కుటుంబ సభ్యులు స్వామి వారికి కళ్యాణ తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు.వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి అభిషేకం, అలంకరణతో పాటు వేద మంత్రోచ్ఛరణల మధ్య దాదాపు 2 గంటల పాటు స్వామి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణోత్సావానికి పట్టణ వాసులు అధిక సంఖ్యలోతరలివచ్చి కళ్యాణాన్ని కనులారావీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరు యాంత్రిక జీవితానికి అలవాటు పడి దైవ మార్గానికి దూరమవుతున్నారని, ప్రతి ఒక్కరు దైవమార్గాన్ని అనుసరిస్తే కుటుంబంలో,సమాజంలో సుఖశాంతులు విరజిల్లుతాయని ఆయన పేర్కొన్నారు. సుఖమయమైన జీవితాన్ని మానవులు అలవర్చుకోవాలని, అలాంటి జీవితం ఒక్క అధ్యాత్మిక శక్తిద్వారానే లభిస్తోందన్నారు. మధ్యాహ్నం నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కల్వకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయ న్ కలిమిచెర్ల రమేష్‌లతో పాటు పలువురు ఆర్యవైశ్య జిల్లా, పట్టణ, మండల, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కళ్యాణోత్సవకార్యక్రమానికి విచ్చేసినఎమ్మెల్యే జైపాల్ యాదవ్,నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, వెల్దండ జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులను ఆలయ నిర్వాహకులు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం,వైస్ ఎంపీపీ కొందూర్ గోవర్ధన్, టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు మధు, కౌన్సిలర్ బాలునాయక్, గోపిరెడ్డి లక్ష్మిరాంరెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు కల్వరమేష్, కల్వ హరికృష్ణ, చిత్తనూరి భాస్కర్, నాయకులు కుడుముల మనోహర్‌రెడ్డి, చిగుర్లపల్లి శ్రీధర్, మిర్యాల రాజయ్య, గంప శ్రీను, వాస శేఖర్, సంబు రమణ, రైస్ మిల్ రవి, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.





## ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్‌కు భారీ షాక్

-కాంగ్రెస్‌లో చేరిన కీలక నేతలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
ఇబ్రహీంపట్నంలో అధికార పార్టీ బిఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ,రాయపోల్ తదితర గ్రామాలకు చెందిన సుమారు వంద మంది యువకులు బిఆర్ఎస్ మాజి మండల అధ్యక్షులు,ఉద్యమకారులు బోసుపల్లి వీరేష్,సీనియర్ నాయకులు మంకాల దాసులు సుమారు వంద మంది యువకులతో మాజి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ప్రజాసంక్షేమం కోసం ఎమ్మెల్యే అహర్నిశలు కృషి

పైలెట్ హయంలోనే తాండూరు ప్రాంతం అభివృద్ధి

మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్



ఫార్మేషన్ రొడ్డు పనులను ప్రారంభిస్తున్న కోహీర్ శ్రీనివాస్

**పెద్దేముల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
ప్రజాసంక్షేమం కోసం తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అహర్నిశలు కృషిచేస్తున్నారని మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రం శివారులోని చాకలి విఠల్ పోలము నుంచి హనుమాన్ దేవాలయం వరకు సిడిపి నిధులు రూ. 5 లక్షలతో పార్మేషన్ రొడ్డు పనులను కోహీర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోహీర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హయంలో తాండూరు నియోజకవర్గంలోని పల్లెలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని అన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముందుకు దూసుకెళుతున్నారని అన్నారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు.దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం కేసిఆర్‌కే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్‌పార్టీ ప్రధానకార్యదర్శి సి.రంగయ్య, గ్రామ కమిటి అధ్యక్షుడు డివై ప్రసాద్, నాయకులు బంగ్లా రఘు, మామిళ్ళ వెంకట్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగేలా చూస్తాం

-శివస్వాముల కుటుంబసభ్యులకు బండి సంజయ్ భరోసా



శివస్వాముల కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న బండి సంజయ్.

**తాండూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**
రిమాండ్‌లో ఉన్న శివస్వాములకు న్యాయం జరిగేలా చూస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ రిమాండ్‌లో ఉన్న శివ స్వాముల కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా తాండూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కార్యక్రమం గురువారం రద్దు కావడం జరిగింది. పరిగి నియోజకవర్గం రూప్‌ఖాన్ పేటలో జరిగిని ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాలాల మండలం దేవనూర్ గ్రామంలో జరిగిన శివస్వాముల ఘటనలో రిమాండ్‌లో ఉన్న శివస్వాముల కుటుంబసభ్యులు కలవడంతో జరిగిన ఘటనపై ఆరాతీశారు. వారికి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. శివస్వాములకు ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని బండి సంజయ్ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి చందశేఖర్, జిల్లా అధ్యక్షులు సదానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్ కుమార్, యాలాల మండల అధ్యక్షులు మహిపాల్ తదితరులు ఉన్నారు.

## మన్నేగూడలో బండి సంజయ్‌కు ఘన స్వాగతం



పూడూరు మండల మన్నెగూడలో రాష్ట్ర బిజేపీ అద్యక్షుడు బండి సంజయ్,మాజీ ఎంపి విశేశ్వర్‌రెడ్డిలకు స్వాగతం పలుకుతున్న పూడూరు మండల పార్టీ అద్యక్షుడు,అనీల్,మల్లేష్ తదితరులు

**పూడూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**
వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మన్నేగూడ చౌరస్తాలో గురువారం భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అద్యక్షుడు బండి సంజయ్ కుమార్‌కు ఘనంగా స్వాగతం లభించింది.పరిగి నియోజకవర్గం పర్యటనకు హైద్రాబాద్‌నుండి చేవెళ్ల మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి బయలుదేరిన సంజయ్ కాన్వాయ్‌ను మన్నేగూడ చౌరస్తాలో ఆపి శాలువాలు, పూలమాలలతో సన్మానించి స్వాగతం పలికారు,అనంతరం మన్నేగూడ నుండి పరిగి మండలం రూఫ్‌ఖాన్‌పేట్‌వరకు పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీగా బిజేపి అద్యక్షుడి కాన్వాయ్‌తో కలిసి వెళ్లారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజేపి కిసాన్‌మోర్చా ఉపాద్యక్షుడు మారుతీకిరణ్ బూనేటి,పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు, పార్టీ పరిగి నిమోజక నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి,మండల పార్టీ అద్యక్షుడు జాజుల అనీల్,జిల్లా బిజేపి ఉపాద్యక్షుడు మల్లేశం,పులువురు పూడూరు,పరిగి,కుల్కచెర్ల,దోమ తదితర మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.



చేవెళ్ల మండల కేంద్రంలోని కెవిఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపి బండి సంజయ్, మాజీ ఎంపి కొండ శ్వేశ్వర్‌రెడ్డి,చేవెళ్ళ నియోజకవర్గ సీనియర్ నాయకుడు వర్రీ తులసీరామ్ విజయ్‌కుమార్,కంజర్ల ప్రకాష్,టిఎస్ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీవిలాస్, ఆర్మీ వెంకటేష్, మీసాల వంశీ, మండల శాఖ అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి, కేసారం సర్పంచ్ కాసుల రమేష్‌గౌడ్, కాసుల రాఘవేందర్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి,కాసుల నిరంజన్‌గౌడ్,కాసుల లక్ష్మణ్‌గౌడ్, రాముగౌడ్,కాసుల నాగరాజ్‌గౌడ్‌లు తదితరులు పాల్గొన్నారు. (చేవెళ్ళ - ప్రభాతవార్త)

# సమస్యల పరిష్కారానికి పోరాడతాం : బిజెపి



**మేడ్చల్ ఫిబ్రవరి16,ప్రభాతవార్త :**
గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ బాసరగడి గ్రామంలో మున్సిపల్ అధ్యక్షుడు ఉసిగారి శ్రీనివాస్ శక్తి కేంద్రం ఇంచార్జ్ మహేష్ బాసరగడి బూత్ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ప్రజాగోస బిజెపి భరోసా కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి హాజరైయ్యారు.ఈ సందర్భంగా బాసరగుడి గ్రామానికి గోదావరి నీళ్ల రావడం లేదని చెత్త సేకరణకి కూడా 100 రూపాయలు వసూలు చేసి చెత్తను తీసుకెళ్లడం జరుగుతుందని గ్రామపంచాయతీ ఉన్నప్పుడు ఉచితంగా చెత్త సేకరించి తీసుకెళ్లేవాళ్లు గ్రామంలోని సమస్యలు మీటింగ్‌కి వచ్చిన ప్రతి ఒక్కరూ వాళ్ల సమస్యలను తెలియజేశారు.రేషన్ కార్డులు లేవని 60 సంవత్సరాలు నిండిన వాళ్లకు కూడా పెన్షన్ రావడం లేదని దళితబంధు రావడంలేదని వివిధ రకాల సమస్యలు ఎన్నో గ్రామంలో ఉన్నాయని చెప్పారు.అనంతరం పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ... ఈ సమస్యలన్నింటి కోసం బిజెపి తరపున పోరాడుతామని వాళ్లకు హామి ఇచ్చారు.అస్తవ్యస్తమైన టిఆర్ఎస్ పాలనతో అభివృద్ధికి నోచుకొని గ్రామంలో ఇది ఒకటి రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబం మేడ్చల్‌లో మల్లారెడినడ కుటుంబం అధికారం చెలాయిస్తోంది.ప్రజల సమస్యలను గాలికి వదిలేసి మంత్రి మల్లారెడ్డి తన ఆస్తులను మాత్రం పెంచుకొని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు.కేంద్రంలో నరేంద్ర మోడీ పరిపాలన చూసి ప్రపంచ దేశాలన్ని ఆయన వైపు చూస్తున్నాయి.మన రాష్ట్రంలో కూడా బిజెపి అధికారంలోకి వస్తే ఉచిత విద్య ఉచిత వైద్యం అందజేస్తామని ఇల్లు లేని వాళ్లకు ఇల్లు కట్టిస్తామని ఒకసారి బిజెపికి అవకాశం ఇవ్వమని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం సరస్వతి సముద్రాల హంస రానీ ,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్,కిషన్ పిడుగుల నాగరాజు,మహేష్ అరుణ్,కృష్ణ,నవీన్,వినయ్ అడ్వకేట్ రాజు,బిజెపి నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మధ్యలో తవ్వకాలు-పట్టించుకోని అధికారులు

-ప్రమాదవశాత్తు మహిళకు గాయాలు



కేబుల్ కనెక్షన్ నిమిత్తం రోడ్డు మద్యలో తవ్వకాలు జరిపిన దృశ్యం

**కొడంగల్,ఫిబ్రవరి 16ప్రభాతవార్త**
కేబుల్ కనెక్షన్ పేరుతో రోడ్డు మద్యలో ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతుండడంతో ప్రమాదవశాత్తు గిరిజన మహిళ కిందపడి గాయాలైన సంఘటన పోచమ్మతండా సమీపంలో చోటుచేసుకుంది.తండావాసుల కథనం మేరకు.. కొడంగల్ పట్టణ శివారులోని మిషన్ భగీరథ ప్రధాన సంప్‌హౌస్ సమీపంలోని పోచమ్మ తండాకు వెళ్ళే ప్రధాన రహదారి మద్యలో కేబుల్ కనెక్షన్ నిమిత్తం కాంట్రాక్టర్ జేసీబీతో ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నాడని పేర్కొన్నారు.రోడ్డు పక్కవైపు నుంచి లైన్ వేయాల్సి ఉన్నా కాంట్రాక్టర్ అవేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా రోడ్డు మద్యలో తవ్వకాలు జరుపుతుండడంతో వాహనాలు సైతం తండాకు వెళ్ళలేని పరిస్దితులు నెలకొన్నాయని తండా సర్పంచ్ శంకర్‌నాయక్ ఆరోపించారు.కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్డు మద్యలో తవ్వకాలు జరుపుతున్నా సంభందిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు.ఈ క్రమంలో గురువారం తండాకు చెందిన మహిళ అటువైపు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడడంతో గాయాలైయ్యాయని సర్పంచ్ తెలిపారు.ఇప్పటికైనా సంభందిత అధికారులు స్పందించి రోడ్డు పక్కవైపు నుంచి కేబుల్ కనెక్షన్ వైర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని,అలాగే ఇష్టానుసారంగా రోడ్డు మద్యలో తవ్వకాలు జరుపుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు.

# అన్నదానం మహాగొప్పది : మంత్రి మల్లారెడ్డి



కీసరగుట్టలో మున్నూరుకాపు సంఘం ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి

**కీసర,ఫిబ్రవరి16,ప్రభాతవార్తః**
అన్ని దానాల్లో కెల్ల అన్నదానం మహాగొప్పదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.కీసరగుట్టలో గురువారం మహాశివరాత్రి సందర్బంగా మున్నూరు కాపు సంఘం,ఆర్యవైశ్య సంఘం,అఖిల భారత వంశీరాజ్ అన్నదాన సత్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.... కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేయుచున్న భక్తులకు,క్రీడలు ఆడడానికి వచ్చిన విద్యార్దులకు,పోలీసులకు,అన్ని శాఖ అధికారులకు వివిద సంఘాల నేతలు అన్నదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిండ్ల శ్రీనివాస్ పటేల్,మండల అద్యక్షులు చిందం మహేందర్ పటేల్,ప్రధాన కార్యదర్శి చంద్రి శ్రీనివాస్ పటేల్,కోశాధికారి పోతంశెట్టి వెంకటేశ్వరరావు,రాష్ట్ర మున్నూరు కాపు సంఘం నాయకులు మీసాల చంద్రన్న,సామల వేణు,వేల్పుల శ్రీనివాస్,సురేష్,తేళ్ల శ్రీధర్,కర్ర వెంకన్న,ఏనుగు వెంకటేశ్వర్లు సంద ముత్తన్న,కంభం కనకన్న,ఆకుల సురేష్,చందుపట్ల రాజన్న,తోట నరేష్,ఉప్పు వీరేష్,ఆకుల భాస్కర్,కొంతం శ్రీనివాస్,చేవూరి సుధాకర్,తాడిశెట్టి రాజయ్య, నాయకం రాం నర్సయ్య,గంద్ర కమలకర్,డెగల క్రిష్ణ,రాజు,గంధం లక్ష్మన్, రాంశెట్టి వెంకటేష్,కంభం రమేష్,బామన్ల శ్రీను,అభిరాం,కాశెట్టి కుమార్,కూన మహేష్,ఆర్యవైశ్య సంఘం అద్యక్షులు బెలిదె రమేష్‌గుప్తా,అఖిల భారత వంశీ రాజ్ అన్నదాన సత్రం అధ్యక్షులు వంశీరాజ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంకుశాపూర్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపిపి సుదర్శన్ రెడ్డి



.అంకుశాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
మన ఊరు మన బడి కార్యాక్రమంలో భాగంగా అంకుశాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణా పనులను గురువారం ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కొరకు మండలంలోని అంకుశాపూర్, ఏదులాబాద్, కొర్రెముల, ప్రతాప సింగారం, కాచవాని సింగారం తదితర గ్రామాల్లో దాదాపు కోటీ 60 లక్షల నిధులు కేటాయింపులు జరిపినట్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతప్రమాణాలు లోపించకుండా అధికారుల పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఎంపీపీ వెంబడి ఏఈ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

### మండలి డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాష్ ఎన్నికపై హర్షం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా బండ ప్రకాష్ ఎన్నిక కావడం పట్ల ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బర్ల హరిశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ రాజ్యసభసభ్యులుగా, ఎమ్మెల్సీగా, ముదిరాజ్ మహాసభ అధ్యక్షులుగా ప్రకాష్ ప్రజలకు అందించిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ మండలి డిప్యూటి చైర్మన్‌గా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి, ప్రజాసమస్యలను పరిష్కరించడంలో బండ ప్రకాష్ ఎంతగానో కృషి చేశారని శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం హర్షదాయకమన్నారు.

### ఇరుముడితో శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు



శ్రీశైల ం బయలుదేరిన శివస్వాములు

**కొత్తూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**
కొత్తూర్ పురపాలిక కేంద్రంలో శివమాలలు ధరించిన స్వాములు గురువారం కరోళ్ల సురేందర్‌స్వామి ఆధ్వర్యంలో ఇరుముడితో శ్రీశైల మల్లికార్జునస్వామి దర్శ నానికి బయలుదేరి వెళ్లారు. స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం శివనామస్మరణతో శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. పురవీధులు ఓం నమ: శివాయ అనే శివనామస్మరణ శబ్దాలతో మర్మోగాయి. ఈకార్య క్రమంలో శివస్వాములు వెంకటేష్‌స్వామి, రాముస్వామి, నరసింహస్వామి, సిరి స్వాములు, కరోళ్ల రవి తదితరులు ఉన్నారు.

## పండుగలు సంస్కృతి సంప్రదాయాలు ప్రతీకగా నిలుస్తాయి: మంత్రి మల్లారెడ్డి



పోచారం శ్రీ సర్వమంగళ సమేత స్ఫటికలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
మన పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని శ్రీ సర్వమంగళ సమేత స్ఫటిక లింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో గురువారంమంత్రి మల్లారెడ్డి పాల్గొని ధ్వజారోహణ చేసి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. శివరాత్రి పండుగ శుభాకాంక్షాలను ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, మాజీ ఎంపీటీసీ చెర్కు బద్రీనారాయణ గౌడ్, కౌన్సిలర్లు సామల శ్రీలతారెడ్డి, బద్దం మమతరాణి, ఎ. శైలజారెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, సుర్వీ రవీందర్, చింతల రాజశేఖర్, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎం. సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు బాలేశ్, మాజీ సర్పంచ్ చెర్కు సరితాగౌడ్, నాయకులు అబ్బవతి నర్సింహ, బి. జగన్ మోహన్ రెడ్డి, సామల బుచ్చిరెడ్డి,బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి, మోటు పల్లి శ్రీనివాస్, సుర్వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా ఆంజనేయులు



నియామక పత్రం అందుకుంటున్న అంజనేయులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా బర్ల అంజనేయులు నియమితులయ్యారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌కు చెందిన అంజనేయులు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసి ఉద్యమకారులను ఐక్య పరచి పోరాటం చేయగా ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు రాష్ట్ర కమిటీ చైర్మన్ బాలశ్రీనివాస్ చేతుల మీదుగా అంజనేయులు నియామకపత్రం అందుకున్నారు. రాష్ట్రంలోని ఉద్యమకారులందరిని ఐక్యపరుస్తూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకి కృషి చేయాలని రాష్ట్ర కమిటీ ఆయనను ఆదేశించింది. మార్చి 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని అంజనేయులు పేర్కొన్నారు. తనకు రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కడ్తాల్‌లో ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**కడ్తాల్,ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :**
మండలంలోని కడ్తాల గ్రామంలో హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రధాని మోదీ చిత్రపటానికి మండల బిజెపి నాయకుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హాజరై మాట్లాడుతూ భారత ప్రధాని నరెంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ మంత్రి మండలి సమావేశంలో దేశంలో గల గ్రామీణ కుల వృత్తుల అభివృద్ధిలో భాగంగా పిఎసిఎస్ సంఘాలను మండల స్థాయిలో కాకుండా గ్రామీణ స్థాయిలో కూడా బలోపేతం చేయాలని అలాగే గ్రామాలలో ఉండే దాదాపు ముఖ్యమైన 16 కులవృత్తులు గల వారికి చేపల పెంపకం, వడ్రంగి, కుమ్మరి, నాయిబ్రాహ్మణ తదితర గ్రామీణ కులవృత్తి సంఘాలుగా ఏర్పాటు చేసుకునే విధంగా కార్యాచరణ రూపొందించి వారికి కేంద్రం నిధులు కేటాయించి గ్రామీణ కుల వృత్తుల వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పాత్లావత్ మన్యనాయక్, మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, జిల్లా నాయకులు యాదగిరి,. సాయిలాల్ నాయక్, రవిందర్‌రెడ్డి, మండల నాయకులు శ్రీశైలం, ప్రేమ్‌కుమార్, మహేష్‌కుమార్, కర్ణాకర్, వెంకటేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్లను పరిశీలించిన సిఐ



**బషీరాబాద్,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:**
బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి గ్రామంలో గల శ్రీ మహాదేవ లింగేశ్వర ఆలయం వద్ద మహాశివరాత్రి నాడు నిర్వహించే జాతర ఏర్పాట్లను తాండూర్ గ్రామీణ సిఐ రాంబాబు,ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి కలిసి పరిశీలించారు.అంతకుముందు శివాలయంలో శివలింగానికి ప్రత్యక్య పూజలు నిర్వహించి దర్శంచుకున్నారు.అనంతరం గ్రామ పెద్దలతో కలిసి జాతర ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.అక్కడి నుండి కోర్విచెడ్ ఘని గ్రామానికి వెళ్లి వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

## దోమలో రక్తనమూన పరీక్షలు



రక్త పరీక్షలు జరుపుకుంటున్న రాజిరెడ్డి

**దోమ.పిబ్రవరి 16 ప్రభాతవార్త :**
వ్యక్తి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు రక్తపరీక్షలు ఎంతో అవసరం అని దోమ సర్పంచ్ కె.రాజిరెడ్డి అన్నారు.గురవారం నాడు దోమ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా రక్త పరీక్షలు జరుపగా ముఖ్యఅతిదిగా హజరై రక్త పరీక్షలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో దోమ ఆసుపత్రి రక్త నమూనాలు,పరీక్షలు చేయడంలో మెదటి స్తానం ఉందని తెలిపారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రోగులకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా మెరుగైన సేవలు అందించడము జరుగుతుందనిఅన్నారు.రక్త పరీక్షలకు వేల రూపాయలు ఖర్చు అవుతాయని అలాంటి పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేయడం ద్వారా అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఆసుపత్రి వైద్యురాలు విద్య మాట్లాడుతూ రక్త పరీక్షల ద్వారా కిడ్నిపంక్షన్,షుగర్,బీపి,థైరాయిడ్,రక్తప్రసరణ,కొలేస్ట్రాల్ తదితర రోగాలను నిర్ధారించేందుకు పరీక్షలు జరుపుకోవాలని అన్నారు.వ్యాది నివారణ కోసం మందులు వాడి తగ్గించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

### నేడు మల్బరీతోటల పెంపకంపై శిక్షణ

**దోమ.పిబ్రవరి 16 ప్రభాతవార్త :**
ఈ నెల 17 న మల్బరి తోటల పెంపకం పై శిక్షణ కార్యక్రమం జరుపనున్నట్లు పర్గి డివిజన్ ఉద్యానవన శాఖ అదికారి వైజయంతికల్యాణ్ తెలిపారు. మండల పరిదిలోని బట్లచందారం గ్రామములోఉద్యానవన పట్టుపరిశ్రమ శాఖ,కేంద్ర ప్రభుత్వ పట్టు సంస్ధ ఆద్వర్యములో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంబించనున్నట్లు పేర్కొన్నారు.మల్బరిలో సస్యరక్షణ చర్యలు, పట్టుపురుగుల పెంపకం,చర్చించడము జరుగుతుందనిరైతులందరు హాజరుకావాలని కోరారు.

## సహకార సంఘం డైరక్టర్‌గా మహేందర్ ఎన్నిక

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ రైతుసేవా సమకార సంఘం డైరక్టర్‌గా వర్త్య మహేందర్‌నాయక్ ఎన్నిక అయ్యారు. సొసైటీలోని ఎదులాబాద్ పరిధి 5వ ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ-5) ఎస్‌టీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి 2020 ఫిబ్రవరి 15న ఎన్నికైన వర్త్య నర్సింగ్ 2020 సెప్టెంబర్ 17న గుండెపోటుతో మృతిచెందారు. ఘణాపూర్ అనుబంధ గ్రామం ఫకీర్‌టెక్యాకు చెందిన నర్సింగ్ మరణంతో డైరక్టర్ పదవి ఖాళీగా ఉంది. తిరిగి ఉప ఎన్నిక జరుపకపోవడంతో మృతుడు నర్సింగ్ కుమారులు తమకు అవకాశం కల్పించాలని సొసైటీ చైర్మన్‌కు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈమేరకు సొసైటీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మాణం చేసి నర్సింగ్ మూడవ కుమారుడు మహేందర్‌నాయక్‌ను నియమించాలని నిర్ణయించుకున్నారు. మేడ్చల్ జిల్లా సహకార శాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం జరిగిన సమావేశం నిర్వహించి సొసైటీ ఎండి కరుణాకర్, యూబిఐ మేనేజర్ సమక్షంలో సొసైటీ డైరక్టర్‌గా మహేందర్‌ను ఎన్నిక చేశారు. ఈసందర్భంగా మహేందర్‌ను చైర్మన్ రాంరెడ్డి శాలువా, పూలదండలతో సన్మానించారు. ఎట్టకేలకు గత రెండున్నర సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న డైరక్టర్ పదవిని భర్తీ చేశారు. ఈకార్యకమంలో వైస్‌చైర్మన్ బద్దం అనంతరెడ్డి, డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, జడిగె రమేశ్, జిల్లాల పోచిరెడ్డి, గోపు బాల్‌రాజ్, వంగూరి లక్ష్మమ్మ, గ్యార వెంకటేశ్, కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఇటిక్యాల రామకృష్ణారెడ్డి, మేనేజర్ రత్న జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ సొసైటీలో మహేందర్‌ను సన్మానిస్తున్న చైర్మన్ రాంరెడ్డి, డైరక్టర్లు